క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

దొరవారిసత్రం: మండలంలోని తల్లంపాడు సచివాలయం పరిధిలోని మొదుగులపాళెం పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోనున్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న దాత

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. రంజాన్‌ను పురస్కరించుకుని పట్టణానికి చెందిన షేక్ కరిమూల్లా దుస్తులతో పాటు బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. దాతకు ఆశ్రమ నిర్వాహకులు సునితా, బెన్నిలు కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకగా తిరుచ్చి ఉత్సవం



గూడూరు: కోనేటిమిట్టలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుచ్చి ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం ఉత్సవమూర్తులు, చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ సంవాదం చేశారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. భక్తులు కోనేటిలో మునిగి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా కృష్ణారావు, ఉమాదేవి వ్యవహరించారు. ఆలయ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు, ఈఓ నవీన్‌కుమార్, ధర్మకర్తలు పెంచలయ్య పర్యవేక్షించారు.

కనులపండువగా రాములోరి పట్టాభిషేకం


పూజలు చేస్తున్న అర్చకులు

సైదాపురం: శ్రీరామనవమిని ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సైదాపురంలో శ్రీరాముని పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల సందడి


అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ చంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు చంద్రరెడ్డి, సాయి రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో ఆదర్శ్ సేవా సంస్థ, చతుర్య స్కిల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు టీసీఎల్ కర్మాగారంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పాపానాయుడుపేట, ఏర్పేడు, చెన్నంపల్లి, వికృతమాల, పెన్నగడం, పెనుమల్లం, గుడిమల్లం, ఎండీ పుత్తూరు, కందాడు తదితర గ్రామాల నుంచి వచ్చిన 56 మంది నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేశారు. వారి విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను త్వరలో ప్రకటించనున్నట్లు ఆదర్శ్ సేవాసంస్థ వ్యవస్థాపకుడు ఐతేపల్లి గురునాథం తెలిపారు.

సన్మార్గం చూపించడమే క్రీస్తు సందేశం

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు


వాకాడులో సమాధుల వద్ద ప్రార్థనలు


దొరవారిసత్రం: నెల్లూరుపల్లిలో..


దొరవారిసత్రంలో పాస్టర్ ప్రసంగం


చిల్లకూరులో..

గూడూరు: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవులు ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దల సమాధులను పుష్పాలతో అలంకరించి వారిని స్మరించుకుంటూ ప్రార్థనలు నిర్వహించారు. గూడూరులోని ఎస్ఏఎల్‌సీ చర్చిలో ఏసుక్రీస్తును స్మరిస్తూ గీతాలపాన చేశారు. పాస్టర్ ప్రశాంత్‌కుమార్ దైవ సందేశాన్ని వినిపించారు. అనంతరం నిర్వహించిన బైబిల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే గాంధీనగర్‌లోని క్రిస్టియన్ సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహించారు.

పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు, చిల్లకూరు, చెంబేడు, అనకవోలు, పాలచ్చూరు తదితర ప్రాంతాల్లో ఉన్న చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.

దొరవారిసత్రం: సర్వలోకాధికారి ఏసుప్రభువు మరణించి మూడో రోజు తిరిగి వచ్చిన రోజునే ఈస్టర్‌గా జరుపుకుంటామని దొరవారిసత్రం ఎస్ఏఎల్‌సీ చర్చి పాస్టర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం, డీవీ సత్రం, మైలాంగం, నెల్లూరుపల్లి, రామారెడ్డికండ్రిగ, ముచ్చలగుంట, ఆనేపూడి, వేణుంబాకం తదితర గ్రామాల్లోని చర్చిల్లో, మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాధులను పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు.

వాకాడు: మానవ జీవితానికి సన్మార్గం చూపించడమే క్రీస్తు సందేశం సారాంశమని వాకాడు సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి సంఘకాపరి ప్రశాంత్‌బాబు అన్నారు. మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాకాడులోని సమాధుల తోటను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పూర్వీకులను స్మరించుకున్నారు.

చిల్లకూరు: కమ్మవారిపాళెం గ్రామంలోని లోగోస్ లూథరన్ చర్చిలో సంఘ కాపరి విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. చర్చిల వద్ద పేదలకు అన్నదానం చేశారు. అలాగే ఏరూరులోని జాన్స్ లూథరన్ చర్చిలో లలితమ్మ, పల్లమాల చర్చిలో నరేష్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

వెంకటగిరి: పట్టణంలో ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. లూథరన్ చర్చి, కాంపాళెం, అరవపాళెం, రైల్వేస్టేషన్‌రోడ్డు, ఏపీటీఎఫ్ కాలనీ, సెయింట్‌ఫ్రాన్సిస్ పాఠశాల ఆవరణలోని క్యాథలిక్ చర్చిల్లో ఫాదర్‌లు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

నాడు పారిశ్రామిక విప్లవం.. నేడు సంక్షేమ సునామి

-ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి


కిలివేటికి గజమాల వేస్తున్న పార్టీ నాయకులు

తడ: నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాంబట్టు ప్రాంతంలో ప్రభుత్వ పారిశ్రామిక వాడను నెలకొల్పి అభివృద్ధికి బీజం వేస్తే నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించి తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మాంబట్టులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు ఎమ్మెల్యేని గజమాలతో సత్కరించి, పూల వర్షం కురిపించారు. భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యే ప్రభుత్వం ద్వారా అందిన పథకాలను వివరిస్తూ, బుక్‌లెట్లు అందించి ప్రజల ఆశీర్వాదం అందుకున్నారు. ఈ సందర్భంగా కిలివేటి మాట్లాడుతూ.. మారుమూలన ఉన్న మాంబట్టు పంచాయతీలో వ్యవసాయం సైతం అంతంత మాత్రంగా ఉండేదన్నారు. భూములకు తగిన ధర లేక, బతికేందుకు వ్యవసాయం తప్ప మరో దారి తెలియని స్థితిలో ఉన్న రైతులు, పేదలకు వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే జీవితాలు ఒక్కసారిగా మారిపోయాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. రుణ మాఫీతో రైతులకు ఆర్థిక కష్టాలు కొంత వరకు తొలగిపోగా పారిశ్రామిక ప్రగతి మొదలవడంతో భూములకు మంచి విలువ ఏర్పడిందని తెలిపారు. పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఉపాధి అవకాశాలు ఊహించని రీతిలో రావడంతో ప్రతి కుటుంబం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహానేత మరణం తరువాత ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి నవరత్నాల పేరుతో సంక్షేమ ఫలాలు అందిస్తూ గడప గడపలో సంతోషం వెల్లివిరిసేలా చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్ కుటుంబం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఇక్కడ లభించిన స్వాగతం, ఆదరణే అందుకు నిదర్శనమని కిలివేటి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమోసుబాబు, ఎంపీపీ కె.రఘురెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఇందుమతి కార్తిక్, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, జిల్లా ఏపీబీ డైరెక్టర్ మునీష్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య, ఎంపీటీసీ శ్రీపతి, మండల జేసీఎస్ కన్వీనర్ సుందర్‌రెడ్డి, నాయకులు నందారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్, పురుషోత్తం, తిరుమల, ఆర్ముగం, కోదండం, రవిరెడ్డి, మునుస్వామిరెడ్డి, రత్నం, జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వానికే ప్రజల మద్దతు


మాట్లాడుతున్న దామోధర్‌రెడ్డి

వాకాడు: ప్రజల అభ్యున్నతికి శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే ప్రజల మద్దతు ఉందని వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వాకాడు, కొండాపురం సచివాలయాల పరిధిలోని గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొన సమస్యలు, నేడు జగనన్న అందిస్తున్న ప్రభుత్వ పనితీరును గృహ యజమానులకు వివరించి తద్వారా వారినుంచి వచ్చే సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వాకాటి నాగభూషణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రంగనాథ్, దువ్వూరు భార్గవ్‌రామ, యల్లంటి భాస్కర్ రెడ్డి, గిరి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


ఎస్ఐలు, కానిస్టేబుళ్లకు సూచనలు చేస్తున్న సీఐ

నాయుడుపేటటౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని నాయుడుపేట అర్బన్ సీఐగా బాధ్యతలు తీసుకున్న కె.నర్సింహారావు అన్నారు. స్థానిక స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐలు శ్రీకాంత్, వేణు, కృష్ణయ్య, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బందితో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అలాగే వార్డు, గ్రామ సచివాలయల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళా పోలీసులు శాలువ కప్పి సత్కరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైడీషీటర్లు, పాత నేరస్తులను సమావేశపరిచి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

సమష్టి కృషితోనే సమస్యలు పరిష్కారం


బద్రినవీన్ దంపతులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

వెంకటగిరి: గాండ్ల, తెలికుల కులస్తులు సమష్టిగా కృషి చేస్తేనే సమస్యలు పరిష్కరించుకోగలమని రాష్ట్ర గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి హరగోపాల్ అన్నారు. స్థానిక పింజలవీరయ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆ సంఘం వెంకటగిరి శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వర్గానికి చెందిన ప్రముఖుల దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు దివంగత గ్రోసు గోపాలయ్య సంస్మరణ కార్యక్రమం జరిగింది. సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి శ్రీనివాసులు, సూర్యప్రకాష్, బీకేప్రసాద్, చిరువెళ్ల ప్రభాకర్, బద్రి నవీన్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



నాయుడుపేటటౌన్: గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెల్లూరుపల్లి నాగరాజ అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన సంఘ సమావేశంలో మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన చిరువేళ్ల ముని హేమంత్, ప్రధాన కార్యదర్శిగా బద్రి సురేష్, ఉపాధ్యక్షుడిగా చిరువేళ్ల యాగ్నేష్, కోశాధికారిగా కె.చెంగయ్య, సంయుక్త కార్యదర్శిగా రామూర్తిలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

మల్లాం ఆలయంలో ప్రత్యేక పూజలు

చిట్టమూరు: మల్లాం గ్రామంలోని వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి శాంతి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

వెంకటగిరి: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలను అధికారులు పక్కాగా నిర్వహించాల ని మాదిగ విద్యార్థి ఫెడరేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా మాజీ అధ్యక్షుడు మంగళపురి సురేష్‌మాదిగ కోరారు. స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశాంత్, కిరణ్, సురేష్, జగజ్జీవన్‌రాం ఉన్నారు.

వైభవంగా రాపూరమ్మ జాతర



రాపూరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఆలయం వద్ద భక్తుల సందడి

రాపూరు: గ్రామ దేవత రాపూరమ్మ జాతర మూడో రోజు ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారికి పొంగళ్లుపెట్టి నైవేద్యం సమర్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

రాపూరమ్మను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులుశశిరెడ్డి, మస్తాన్, కోటిరెడ్డి, పిచ్చిరెడ్డి, లోకేష్, వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

రాపూరమ్మ గ్రామోత్సవం ఆదివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ రాపూరు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

మజ్జిగ పంపిణీ



నాయుడుపేటటౌన్: పట్టణంలోని దుర్గావీధి, ప్రభుత్వ వైద్యశాల వద్ద శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఉగాది నాటి నుంచి ప్రతి రోజు ప్రధాన కూడళ్లలో పంపిణీ చేస్తున్నారు. అలాగే నారాయణ సేవ పేరుతో పట్టణంలోని పలు చోట్ల ఆహార ప్యాకెట్లు అందజేశారు.

జగనన్న పాలనలో ఇంటింటా వెలుగులు

- నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక
- జోరుగా జగనన్నే మా భవిష్యత్తు
- ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



నాయుడుపేట: కరపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక, పెళ్లకూరు మండలం అర్లపాడులో..

నాయుడుపేటటౌన్: జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమ వెలుగులు నిండాయని మున్సిపల్ చైర్మన్ దీపిక అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆయన అండగా నిలవాలని కోరారు. అనంతరం వారి అనుమతిలో ఇంటి ముందు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైఎస్సార్ నాయకులు బైనా మల్లికార్జున రెడ్డి, చంద్రారెడ్డి, కటకం జయరామయ్య, శివప్రసాద్ శర్మ, కామిరెడ్డి రాజారెడ్డి, అర్బన్, రూరల్ జేసీఎస్ కన్వీనర్లు చదలవాడ కుమార్, ఒట్టురు కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

కోట: మండలంలోని తిన్నెలపూడి, మద్దాలికండ్రిగ, వెంకన్నపాళెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ మొబీన్‌బాషా, సుధారెడ్డి, సర్పంచ్ శ్రీదేవి, నాగరాజు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని పిడితలపూడి, బూదనం, నల్లాయగారిపాళెం, వల్లిపేడు గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఇంటి యజమాని అనుమతితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్‌ను గోడకు అంటించారు. జెడ్పీటీసీ మన్నెవ శీనయ్య, వైస్‌ఎంపీపీ పోలుబోయిన చెంగయ్య, ఎంపీటీసీ ఎల్లసిరి జానకిరామ్, సచివాలయ మండల కన్వీనర్ వెదనపర్తి మనోజ్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని అర్లపాడు, ముమ్మారెడ్డి గుంట గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. జగనన్నను మరోసారి మనసారా ఆశీర్వదించాలని గ్రామస్తులను కోరారు. ఎంపీటీసీ సభ్యుడు కుమారస్వామి, నాయకులు ఓడూరు వినోద్‌కుమార్‌రెడ్డి, మట్టిపాటి చెంగయ్య, హరి, నరసింహులు, చినమునెయ్య, పాపయ్య, విజయమ్మ పాల్గొన్నారు.

చిట్టమూరు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారని జేసీఎస్ మండల ఇన్‌చార్జి చేరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గునపాడు గ్రామంలో ప్రజల అభిప్రాయాలు సేకరించారు.

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కేసీఎస్‌గుంట సచివాలయ పరధిలోని కుదిరి, జంగాలపల్లె గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ మందా దేవేంద్రర్‌రెడ్డి, కుదిరి సర్పంచ్, సచివాలయ కన్వీనర్ బుంగా చెంగయ్య, తుమ్మా రాము, నాగయ్య పాల్గొన్నారు.

కలువాయి: మండలంలోని బాలాజీరావుపేట, బద్దెవోలులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్ కుమార్ రెడ్డి జగనన్న చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి గ్రామస్తులకు వివరించారు. పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఎంపీటీసీ ప్రసాద్, సోమల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓజిలి: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల్చూరు పెద్దచెంగయ్య అన్నారు. మండల పరిధిలోని అత్తివరం గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించారు. అలాగే అత్తివరం గ్రామంలో చల్లా శ్రీధర్‌రెడ్డి, ఎల్లు గురుమూర్తిలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ అనీల్‌రెడ్డి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మన్నారుపోలూరులో కృష్ణ బలిజ పూసల సంఘం డైరెక్టర్ తుపాకుల ప్రసాద్ ఆధ్వర్యంలో వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు ప్రభుత్వ పాలనపై ప్రజలను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

గూడూరు: గూడూరు మున్సిపాలిటీలోని 25వ వార్డులో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బాలిబోయిన రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు.


కోట: తిన్నెలపూడిలో..


చిల్లకూరు: నల్లాయగారిపాళెం గ్రామంలో..


కుదిరి గ్రామంలో..


కలువాయిలో..

బాలసదన్‌కు ఆర్వో ప్లాంట్ వితరణ


ఆర్వో ప్లాంట్ ప్రారంభం

గూడూరు: రోటరీ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రొటేరియన్ దశరథరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని నరశింగరావుపేటలో ఉన్న బాలసదన్‌కు శ్రీనివాసాచారి దాతృత్వంతో ఆదివారం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా బాలసదన్‌లోని పిల్లలకు ఫుడ్ చాయిస్ కార్యాక్రమంలో భాగంగా వారు కోరిన ఆహారాన్ని అందజేశారు. రొటేరియన్‌లు దయాకర్‌రెడ్డి, మునిగిరీష్, శ్యాంయాదవ్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణయ్య, రవికుమార్, జీజీ నాయుడు, రాంప్రసాద్ పాల్గొన్నారు. అలాగే ఐసీఎస్ రోడ్డులోని డీఎస్ఆర్ ఓపెన్ ఆడిటోరియంలో రోటరీ వెస్ట్ గూడూరు క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు సరుకులు అందజేశారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఆడిటర్ శ్రీకంఠి రామ్మోహన్ రావు, క్లబ్ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి ఉన్నారు.


పేదకలకు సరుకులు అందజేత